క్లుప్తంగా

మద్యం, నగదు పట్టివేత

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని మిషన్ కాంపౌండ్ ప్రాంతంలో గురువారం సాయంత్రం జగిత్యాల పట్టణ ఎస్సై మన్మధరావు రూ.8,415 విలువైన మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన చేని వినోద్‌కుమార్ తన ద్విచక్రవాహనంపై మద్యం తీసుకెళ్లుతుండగా పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ చౌరస్తాలో పట్టణ ఎస్సై నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. రూ.25,350 విలువైన బీర్లను సీజ్ చేశామన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడకు చెందిన ఎన్నాకుల నరేశ్, గొల్లపల్లి మండలం వెనుగుమట్లకు చెందిన గొర్రె రాకేశ్‌లు బీర్లు తీసుకెళ్తుండగా పట్టుకొని, వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రూ.1.64 లక్షలు..

జగిత్యాల జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్‌లో గురువారం సాయంత్రం పట్టణ ఎస్సై మన్మధరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. టీఆర్‌నగర్ గ్రామానికి చెందిన ఎండీ.ఇమ్రాన్ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.51,500 తీసుకెళ్తూ పట్టుబడ్డాడు. జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి వద్ద జగిత్యాల-నిజామాబాద్ రహదారిపై పట్టణ ఎస్సై నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన మహమ్మద్ రషీద్ ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.13 లక్షలను సీజ్ చేశారు.

మల్యాల మండలంలో..

మల్యాల: మండలంలో ఎస్సై అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వాహనాల తనిఖీలో నగదు పట్టుకున్నారు. ఎటువంటి పత్రాలు లేకుండా రూ.51,100 తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



పోలీసులు పట్టుకున్న వాహనాలు

మెట్‌పల్లిరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు అన్నారు. వెల్లుల శివారులోని వీఆర్‌ఎం గార్డెన్ సమీపంలో గురువారం నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనదారులకు పలు సూచనలు చేశారు. మొత్తం 32 ద్విచక్ర వాహనాలను పట్టుకున్నారు. మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి, ఏఎస్సై ఆంజనేయులు, కానిస్టేబుళ్లు జనార్దన్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కథలాపూర్: కోరుట్ల-వేములవాడ రోడ్డుపై కథలాపూర్ మండల కేంద్రంలో గురువారం సాయంత్రం పోలీసులు ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. ఎన్నికల వేళ అక్రమంగా మద్యం, డబ్బులు తరలించకుండా ప్రతీ వాహనాన్ని పరిశీలించారు. ఎస్సై నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుతాం

మల్లాపూర్: రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తున్న బీజేపీ విధానాలను తిప్పికొడతామని బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ.మౌలానా అన్నారు. మండలకేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఆలీ, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సహకార సంఘం చైర్మన్ ఎన్నికకు ఏర్పాట్లు

మెట్‌పల్లి: మెట్‌పల్లి విశాల సహకార పరపతి సంఘం నూతన చైర్మన్ ఎన్నిక శుక్రవారం జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. చైర్మన్‌గా ఉన్న తీగల లింగారెడ్డిపై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై ఆయన కోర్టును ఆశ్రయించారు. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకూ చైర్మన్ ఎన్నిక జరపవద్దంటూ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో చైర్మన్ ఎన్నిక ఆలస్యమైంది. రెండురోజుల క్రితం సదరు ఉత్తర్వులను మేజిస్ట్రేట్ రద్దు చేయడంతో చైర్మన్ ఎన్నికకు మార్గం సుగమమైంది. ఉదయం 11 గంటలకు డైరెక్టర్లతో జిల్లా సహకార అధికారి సత్యనారాయణ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో నూతన చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. వెంకట్రావుపేటకు చెందిన కొమిరెడ్డి తిరుపతిరెడ్డిని ఎన్నుకోవాలని ఇప్పటికే నిర్ణయించారు. మొత్తం 13 మంది డైరెక్టర్లలో 11 మంది మద్దతు ఉండడంతో ఆయన ఎన్నిక లాంఛనమే కానుంది.

కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జిగా 'రుత్త'

మల్లాపూర్: కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జిగా కొత్తదాంరాజుపల్లి గ్రామానికి చెందిన ఫిషర్మెన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ నియామకమయ్యాడు. మంత్రులు శ్రీధర్‌బాబు, ప్రభాకర్‌గౌడ్, ఫిషర్మెన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్, కల్వకుంట్ల సుజిత్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న విద్యార్థి పేరు మంగారపు శ్రీకుమార్. లక్ష్మీదేవిపల్లి నాయికపుగూడెంకు చెందిన గిరిజన విద్యార్థి. ఇంటర్ ఫలితాల్లో సారంగాపూర్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 401 మార్కులు సాధించాడు. ఇక్కడి నుంచే తాను మంచి ఇంజనీరవ్వడానికి అధ్యాపకులు బోధన చేస్తున్నారంటున్నాడు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న విద్యార్థిని జంగుబాయి. గిరిజన విద్యార్థిని. సీఈసీ మొదటి సంవత్సరంలో 500 మార్కులకు గాను 437 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. జంగుబాయి బీర్‌పూర్ మండలం మంగేళ గ్రామం నుంచి 30 కిలోమీటర్ల దూరం ఆర్టీసీ బస్సులో వస్తూ చదివింది.

సత్తా చాటిన సారంగాపూర్ ప్రభుత్వ కళాశాల

- ఇంటర్‌లో ఏటేటా పెరుగుతున్న ఉత్తీర్ణతా శాతం



సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

సారంగాపూర్: సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉత్తమ ఫలితాలతో రాణిస్తోంది. ప్రతి సంవత్సరం విద్యార్థుల ఉత్తీర్ణత 90 శాతం దాటుతున్నా.. ఈ సంవత్సరం ఏకంగా 97.18 శాతం చేరుకుంది. దీంతో సారంగాపూర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. సారంగాపూర్ కళాశాలలో సారంగాపూర్, రేచపల్లి, పెంబట్ల, కోనాపూర్, లక్ష్మీదేవిపల్లి, బట్టపల్లి, పోతారం, గ్రామాలతోపాటు బీర్‌పూర్ మండలం మంగేళ, తుంగూర్ గ్రామాల నుంచి ఇక్కడికొచ్చి చదువుతున్నారు.

2008లో..

సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను 2008 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంజూరు చేశారు. అప్పటి మంత్రులు జీవన్‌రెడ్డి, రత్నాకర్‌రావు ఉమ్మడి సారంగాపూర్ మండలానికి రెండు జూనియర్ కళాశాలలను మంజూరు చేయించారు. ఒకటి సారంగాపూర్, మరో కళాశాల బీర్‌పూర్(ప్రస్తుతం బీర్‌పూర్ ప్రత్యేక మండలంగా ఏర్పాటైంది). సారంగాపూర్ కళాశాలకు ప్రత్యేక భవన నిర్మాణాలు, సరిపడినంత స్టాఫ్, అధ్యాపకులు ఉండడం, ల్యాబ్, లైబ్రేరి ఉండడం, కళాశాలలో ఇంగ్లిష్, తెలుగు మీడియం నిర్వహిస్తున్నారు. కళాశాల ఏర్పాటు జరిగినప్పుడు రెండు సంవత్సరాలు ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో వంద శాతం సాధించారు. ఈ సంవత్సరం వంద శాతానికి దగ్గరగా వెళ్లి ఆగిపోయింది.

మూడు గ్రూపుల్లో విద్యాబోధన

ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ మూడు గ్రూపుల్లో విద్యాబోధన జరుగుతోంది. గడచిన విద్యాసంవత్సరంలో మొదటి సంవత్సరంలో 67 మంది, ద్వితీయ ఇంటర్‌లో 76 మంది విద్యనభ్యసించారు.

97.18 శాతం ఉత్తీర్ణత

ఇంటర్ ద్వితీయ సంవత్సరం(2024)లో 97.18 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మొత్తం 73 మంది విద్యార్థులకు గాను 71 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 69 మంది ఉత్తీర్ణత(97.18 శాతం) సాధించారు.

తగ్గిన ఉత్తీర్ణత

ఇంటర్ మొదటి సంవత్సరంలో మాత్రం ఉత్తీర్ణత తగ్గింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో 67 మంది విద్యార్థులకు గాను 63 మంది పరీక్షలు రాయగా.. 47 మంది మాత్రమే(74.60 శాతం) ఉత్తీర్ణత సాధించారు. 2023 సంవత్సరంలో ఉత్తీర్ణతా శాతం 96 శాతం ఉంది.

ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం వరుసగా ఐదు సంవత్సరాల నుంచి..

సంవత్సరం	ఉత్తీర్ణత శాతం
2020	99
2021	93
2022	90
2023	96.6
2024	97.18

ఉత్తమ బోధనతోనే..



అధ్యాపకుల ఉత్తమ బోధనతోనే ఇంటర్ సెకండ్ ఇయర్ ఎంపీసీలో 936 మార్కులు సాధించా. కళాశాలలో ఎంపీసీలో టాపర్‌గా నిలిచా. కొత్తగా చేరాలనుకునే విద్యార్థులు సారంగాపూర్ కళాశాలను ఎంచుకోవాలి.
– కుడుకల అక్షయ, లక్ష్మీదేవిపల్లి

క్రమశిక్షణకు మారుపేరు



సీఈసీ రెండో సంవత్సరంలో 885 మార్కులతో టాపర్‌గా నిలిచా. కళాశాల ఆహ్లాదకర వాతావరణంలో ఉంది. కళాశాలలో విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తారు. అధ్యాపకులు మంచి విద్యనందించారు.
– వై.ప్రణయ్‌కుమార్, సారంగాపూర్

ఉన్నత చదువులకు బాట



ఉన్నత చదువులకు మంచి పునాది వేస్తుంది. బైపీసీ రెండో సంవత్సరంలో 913 మార్కులతో టాపర్‌గా నిలిచా. అధ్యాపకులు ఉన్నత కోర్సులు చేసేందుకు బోధన చేయడంతో ఎంబీబీఎస్‌లో సీటు సాధిస్తానన్న విశ్వాసం కలిగింది. – గుడ్ల రాజేందర్, పెంబట్ల



నవ్య కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

విద్యార్థుల ప్రభంజనం

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. నవ్య కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ బైపీసీలో హాసిని 435/440 మార్కులు, సీఈసీలో సాత్విక 463/500, సెకండ్ ఇయర్ ఎంపీసీలో శాలిని 990/1000, మాధురి 989/1000 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా వారిని కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న రామకృష్ణ

ఆర్‌కే, ఎస్ఎస్వీ కళాశాలలో..

ఆర్‌కే, ఎస్ఎస్వీ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో అక్షయ 465/470, సహేర 465, రహీంఖాన్ 464, సెకండ్ ఇయర్ బైపీసీలో ఉమామహి 988/1000, హైమాన్ 986 మార్కులు సాధించారు. కరస్పాండెంట్ రామకృష్ణ అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

గొల్లపల్లి: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో గొల్లపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సీఈసీ సెకండ్ ఇయర్ ఫలితాల్లో ఇండ్ల పావని 915, సెకండ్ ఇయర్ ఎంపీసీ బుర్ర వనిత 895, ఎంపీసీ ఫస్టియర్ నార్ల రోషిని 400, బైపీసీ సెకండ్ ఇయర్ పిల్లి జ్యోతి 855 మార్కులు సాధించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏనుగుల మల్లయ్య, అధ్యాపకులు సన్మానించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ మండలస్థాయి కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. బీఆర్ఎస్ ఇబ్రహీంపట్నం సీనియర్ నాయకుడు జంగ ద్యావతీ సుదర్శన్, డబ్బా ఎంపీటీసీ దెశెట్టి శాంత, బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు సిరేటి రవి, మూలరాంపూర్ మాజీ సర్పంచ్ నర్సయ్య, యామపూర్ మాజీ సింగిల్‌విండో చైర్మన్ గంగారెడ్డితోపాటు సుమారు 100 మంది బీజేపీ, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వీరికి కాంగ్రెస్ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కండువా కప్పి ఆహ్వానించారు.



జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సుదర్శన్

మోడుకు మామిడి కాయలు



జగిత్యాలఅగ్రికల్చర్: లక్ష్మీపూర్ గ్రామంలో ఓ రైతు మామిడి తోటలోని మామిడి చెట్టు మోడుకు మామిడి కాయలు కాశాయి. సాధారణంగా మామిడి కొమ్మలకు పూతలు వచ్చి కాయలు కాస్తాయి. గతేడాది వేసవిలో కొమ్మలను కత్తిరించడంతో ప్రస్తుతం మామిడి మోడుకు పూత వచ్చి కాయలు కాశాయి. ఒక్కటి కాదు రెండు కాదు ఏకంగా 10 మామిడి కాయలు కాయడం విశేషం.

ఆధ్యాత్మికం

నృసింహుడిని దర్శించుకున్న సిద్దిపేట జడ్జి



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామిని గురువారం సిద్దిపేట జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి రఘురాం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఈవో శ్రీనివాస్ స్వామివారి శేష వస్త్రం కప్పి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. వేదపండితులు ముత్తాలశర్మ, సీనియర్ అసిస్టెంట్ అలువాలు శ్రీనివాస్, అర్చకులు నంబి నర్సింహమూర్తి, ఎస్సై ఉదయ్‌కుమార్, సిబ్బంది తదితరులున్నారు.

నృసింహుడికి వాటర్ కూలర్ బహూకరణ

ధర్మపురి: భక్తుల సౌకర్యార్థం వాటర్ కూలర్‌ను బహూకరించాలని ఎల్ఐసీ డివిజనల్ మేనేజర్ ఎస్‌వీ ప్రసాద్‌రావ్ అన్నారు. ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామి దేవస్థానానికి గురువారం జీవిత బీమా పక్షాన సుమారు రూ.50వేల విలువ గల వాటర్ కూలర్‌ను అందజేశారు. ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామి దేవస్థానానికి దైవదర్శనం నిమిత్తం నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారని, భక్తుల కోసం ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఈవో శ్రీనివాస్, కరీంనగర్ డివిజన్ ఎంఎం శ్రీనివాస్, ధర్మపురి బ్రాంచ్ మేనేజర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి, జిల్లా ఏబీఎం సత్యనారాయణరావ్, డీవో హరీష్, ఏవో సంగనభట్ల నర్సయ్య, సీనియర్ అసిస్టెంట్ అలువాలు శ్రీనివాస్ తదితరులున్నారు.

అయ్యప్ప ఆలయ అభివృద్ధికి విరాళాల సేకరణ

కోరుట్ల: పట్టణ శివారు అయ్యప్ప గుట్టపై ఉన్న అయ్యప్ప, జ్ఞాన సరస్వతి దేవాలయంలో రూ.50లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు గురువారం విరాళాల సేకరణను ప్రారంభించారు. ఆలయ వ్యవస్థాపక, గౌరవ అధ్యక్షుడు చిద్రాల నారాయణ గురుస్వామి, ఆలయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ గురుస్వామి, ప్రధాన కార్యదర్శి తోట రాజు, కోశాధికారి జుంబర్తి రమేశ్, మరో భక్తుడు రూ.1,11,116 చొప్పున మొత్తం రూ.5,55,580 విరాళాలు సమర్పించారు. గడ్డం మధు, గట్ల ఆనంద్, నాగరాజు, ఆడెపు శంకర్, క్రాంతికుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి జీర్ణోద్ధరణ

కోరుట్ల: పట్టణంలోని వేములవాడ రోడ్డులో గల అభయాంజనేయ నూతన ఆలయ నిర్మాణం కోసం జీర్ణోద్ధరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పురోహితుడు రాము శర్మ హోమం జరిపారు. 32వ వార్డు కౌన్సిలర్ జిందం లక్ష్మీనారాయణ, దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

తాట్లవాయిలో నాగవెల్లి

రాయికల్: సీతారామచంద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం తాట్లవాయిలోని సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణలో చిలుకమర్రి శ్యామ్‌సుందరాచారి, రంగాచార్యుల ఆధ్వర్యంలో నాగవల్లి, స్వామివారికి ఏకాంత సేవ, పల్లకి సేవ నిర్వహించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

మడేలేశ్వరస్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు



సారంగాపూర్: బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లె శివారులో మడేలేశ్వరస్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. గురువారం అగ్నిప్రతిష్ఠ, కుంభారాధన తదితర పూజ కార్యక్రమాలు జరిగాయి. దీక్షాపరులు గోదావరి జలాలను స్వామివారి కోసం తీసుకొచ్చారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

బుగ్గారం: బుగ్గారం మండలం శెకల్లకు చెందిన బంక లవన్‌కుమార్(21)కు బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. లవన్‌కుమార్ ద్విచక్ర వాహనంపై గొల్లపల్లి మీదుగా జగిత్యాలకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలు కావడంతో కరీంనగర్ తరలించారు. వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లపల్లి ఎస్సై తెలిపారు.

మహిళ..

మెట్‌పల్లిరూరల్: వెల్లుల గ్రామానికి చెందిన మంతెన గంగు(65) అనే మహిళ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గంగు, ఆమె భర్త నర్సయ్య ఈనెల 22న ఆత్మకూర్‌లోని ఓ ఫంక్షన్ వెళ్లారు. అదేరోజు తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో ఆత్మకూర్ పెద్దమ్మ ఆలయం సమీపంలో టాటా మ్యాజిక్ వాహనం వీరిద్దరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. గంగు తలకు తీవ్ర గాయాలయ్యాయి. మొదట మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

మల్లాపూర్: క్రీడలు మానసికోల్లాసాన్ని కల్గిస్తాయని, యువత క్రీడలతోపాటు సామాజిక స్పృహను అలవర్చుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, జిల్లా ఉపాధ్యక్షుడు బద్దం గంగాధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం రాత్రి మల్లాపూర్ ప్రీమియర్ లీగ్-2 విజేతలకు కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డితో కలిసి బహుమతి ప్రదానం చేశారు. ఫైనల్‌లో సంజీవన్ లయన్స్ విజేతగా నిలవగా, స్టార్ ఈఎస్‌టీ చాలెంజర్ రన్నరప్‌గా నిలిచింది. మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ శివ శ్రీనివాస్, కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, అధ్యక్షుడు కనుక సంజీవ్, సభ్యులు మోర సతీష్, పుప్పాల మహేశ్, నాయకులు ముద్దం శరత్‌గౌడ్, లవంగ శివకుమార్, సోమ అశ్విన్, ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

జగిత్యాల: ఓటు ఎంతో అమూల్యమైందని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. గురువారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రంగోలి ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, మెప్మా ఏవో శ్రీనివాస్‌గౌడ్, క్రీడల అధికారి రవికుమార్, అశోక్, ప్రకాశ్, లక్ష్మణ్, సందీప్ పాల్గొన్నారు.

దోమల వ్యాప్తి అరికట్టేందుకు కృషి చేయాలి

మల్యాల: దోమల వ్యాప్తిని నిరోధిస్తే వ్యాధులు నియంత్రణలోకి వస్తాయని, ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యురాలు మౌనిక అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరోగ్య సిబ్బంది స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. పి.లక్ష్మీ, దేవీసింగ్, సూపర్‌వైజర్లు సునంద, రమణమ్మ పాల్గొన్నారు.

కథలాపూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని మలేరియాను తరిమికొడదామని కథలాపూర్ వైద్యాధికారి సింధూజ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగభూషణం, సుగుణ, లూసి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెల్గటూర్: మలేరియా నివారణ చర్యలపై డా.శ్రవణ్‌కుమార్, డా.లవకుమార్ ఆధ్వర్యంలో గురువారం వెల్గటూర్, అంబరిపేట పీహెచ్‌సీ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించారు. వెల్గటూర్, అంబరిపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లి: జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి విలాయత్ బేగ్ పేర్కొన్నారు. పట్టణంలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు అంజిత్‌రెడ్డి, వాణి, సిబ్బంది రత్నాకర్, ముజీబ్, ప్రభావతి, జగన్నాథం తదితరులున్నారు.



మల్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

బీఆర్ఎస్‌కు మద్దతివ్వండి

కథలాపూర్: రైతులు, పేదల సంక్షేమం లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు పని చేసిందని, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి కోరారు. గురువారం తాండ్ర్యాల, దూలూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, నాయకులు కల్లెడ శంకర్, నాగేశ్వర్‌రావు, గుండారపు గంగాధర్, బాల్క సంజీవ్, తిరుజాని, నాగమల్లేశ్, ఎండీ రఫీ, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.



తాండ్ర్యాలలో ప్రచారం చేస్తున్న బాపురెడ్డి, నాయకులు

బీఆర్ఎస్ ప్రచారం

పెగడపల్లి: అయితిపల్లిలో గురువారం పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. మండల ఎన్నికల ఇన్‌చార్జి రఘువీర్‌సింగ్ మాట్లాడుతూ.. ఎంపీగా ఈశ్వర్‌ను గెలిపించుకోవాలని కోరారు. మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు రమణారావు, స్వామి, వెంకన్న, సురేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఆనందం, రాజిరెడ్డి, సంజీవరెడ్డి, గంగాధర్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.



అయితిపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బజ్జీలు వేస్తూ ప్రచారం

రాయికల్: పట్టణంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత గురువారం బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి గోవర్ధన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. ఓ హోటల్‌లో బజ్జీలు వేస్తూ ప్రచారం చేశారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాయికల్‌లో ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

బీజేపీ నాయకుల ప్రచారం

పెగడపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు మద్దతుగా గురువారం సుద్దపల్లిలో బీజేపీ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీని గెలిపించాలని ఓటర్లను కోరారు. మండల అధ్యక్షుడు కొమురెల్లి, నాయకులు అంజన్న, వంశీ, అజయ్, తిరుపతి, కుమార్, రాజన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

అరవింద్ గెలుపు లాంఛనమే..

జగిత్యాలటౌన్: నిజామాబాద్ ఎంపీగా ధర్మపురి అరవింద్ గెలుపు లాంఛనమేనని బీజేపీ జగిత్యాల పట్టణ అధ్యక్షుడు రంగు గోపాల్ అన్నారు. గురువారం బీజేపీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ధర్మపురి అరవింద్ నామినేషన్ కార్యక్రమానికి రంగు గోపాల్ ఆధ్వర్యంలో జగిత్యాల శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. జగిత్యాల నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలున్నారు.



సుద్దపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

జీవన్‌రెడ్డిని గెలిపించండి



కూలీలతో మాట్లాడుతున్న శోభారాణి

జగిత్యాలరూరల్: గ్రామాల్లో ఉన్న ప్రతి కూలీకి ఉపాధిహామీ పథకం ద్వారా పని కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని మహిళ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శోభారాణి అన్నారు. గురువారం లక్ష్మీపూర్ గ్రామంలో ఉపాధిహామీ పథకం కూలీలు పని చేస్తున్న ప్రాంతంలో సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో తాటిపర్తి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బీఎల్‌వోలకు ఎన్నికల సామగ్రి పంపిణీ



ఇబ్రహీంపట్నం తహసీల్ కార్యాలయంలో ఎన్నికల సామగ్రి

ఇబ్రహీంపట్నం: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు, ఓటర్లకు అందించేందుకు ఎన్నికల సామగ్రిని తహసీల్ కార్యాలయంలో గురువారం బీఎల్‌వోలకు తహసీల్దార్ ప్రసాద్ పంపిణీ చేశారు. మండలంలోని 37 పోలింగ్ బూత్‌ల్లో పంచేందుకు ఓటర్ స్లిప్‌లు, ఓటర్‌గైడ్, ఫ్లెక్సీలు, క్యాలెండర్లను బీఎల్‌వోలకు అందజేశారు.

పరామర్శ

మల్లాపూర్: వెంకట్రావ్‌పేటలో బోయవాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు మీనుగు చంద్రశేఖర్ నాన్నమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా.. గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు యాదగిరి నర్సింగరావు, తోట శ్రీనివాస్, మచ్చర్ల దశరెడ్డి, ఖాసీం, అంకుస్ తదితరులు పాల్గొన్నారు.